# పేదరాశి పెద్దమ్మ

మంత్రాలంటే మరేవీ కావు. మాటలేనట!

ఇంట్లో నేను వల్లమాలిన అల్లరి చేస్తున్నా, పెద్దవాళ్ల చెప్పినమాట వినకపోయినా, రాత్రుల్లో గుట్టుచప్పుడుగా పడుకోకపోయినా నాపైన ప్రయోగించడానికి మా నానమ్మ దగ్గర ఓ మంత్ర ముండేది.

తొమ్మిది అక్షరాలు దానికి!

నవాక్షరి అనొచ్చు.

అదేమి టంటారా? చెబుతున్నా -

'అనగనగా ఒక రాజు.'

ఆ పద సముదాయం చెవిలో పడగానే, నా మనసు మంత్రముగ్ధమై పోతుండేది.

ఎవ రా రాజు? ఏ దేశానికి రాజు? అతడి కెందరు భార్యలు? ఆ రాజుకు గానీ, లేదా రాణికి గానీ వచ్చిన చిక్కులేమిటి? - ఇలా ఎన్నో ప్రశ్నలు లేత బుర్రలో ముసురుకునేవి.

"చెప్పు, చెప్పు!" అంటూ ఆదుర్దా పడిపోయేవాణ్ణి.

కథ పట్ల నన్ను ఉన్ముఖుణ్ణి చేయడానికి మళ్ళీ అదే మంత్రాన్ని అందిపుచ్చుకునేది నానమ్మ -

"అనగనగా ఒక రాజు ..... ఏమిరా రాజా! వింటున్నావా?"

తెలుసు. నానమ్మ చెప్పే కథ ఎప్పుడూ ఇలాగే ప్రారంభం కావాలనీ, అవుతుందనీ తెలుసు. ఆ రాజు కూడా సామాన్యుడై ఉండడు. ప్రజల పాలిటి కన్నతండ్రి, శత్రువుల పాలిటి చండమార్తాండుడు, దానంలో కర్ణుడు, త్యాగంలో దధీచి, దయాగుణంలో శిబి చక్రవర్తి అయి ఉంటాడు. కానీ ఏం లాభం? కడవంత పాలు చెడిపోడానికి ఓ ఉప్పు రాయి చాలు కదా! ఆ రాజు చెప్పుడు మాటలకు చెవి ఒగ్గేవాడు. ఎద్దీనిందంటే తీసుకెళ్ళి కొట్టంలో కట్టేయమనే రకం!

"ఆ రాజు కిద్దరు భార్యలు!" - నానమ్మ కొనసాగించేది.

నిజమే మరి, రాజుగారి కేం కొదవ? ఎందరినైనా పెళ్లాడొచ్చు. కానీ కత నడవాలంటే కనీసం ఇద్దరు భార్యలైనా ఉండి తీరాలి. అద్దైనా ఒకరికొకరు నకలుగా ఉంటే లాభం లేదు. ఏటికొకరు, కాటికొకరుగా ఉండాలి. పట్టపురాణి పరమ పతివ్రత, సాధ్వీ శిరోమణి, చిన్న భార్య అందుకు విరుద్ధం. పైకి నంగనాచి, లోపల ఆకతాయి. చెప్పేవన్నీ అబద్ధాలు. చేసేవన్నీ కుతంత్రాలు. అన్ని అవగుణాలకూ నెలవు. ఈవిడ పట్టపురాణిపైన లేనిపోని అపోహలు రగిలిస్తుంది. రాజు ముందూ, వెనుకా చూడకుండా పెద్ద భార్యకు రాజ్య బహిష్కార శిక్ష విధిస్తాడు. భటులామెను తీసికెళ్ళి అరణ్యంలో దిగవిడిచేస్తారు. అప్పటికామె వట్టి మనిషి కూడా కాదు, నిండు గర్భిణి!'

"అయ్యో పాపం! ఆ తరువాతేమైంది నానమ్మా?'

నేను ఆరాటంతో ప్రశ్నిస్తాను.

"దిక్కుతోచక, పలుకు తోడు లేక మహారాణి అడవిలో కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తుంది. ఆమె ఏడుపు చూసి అడవిలోని పక్షులు, మృగాలు కూడా కంట తడిపెడుతున్నాయి. ఆ స్థితిలో ఆమె స్నానార్థమై నదికి వెళ్ళి తిరిగొస్తున్న వరతంతు మహాముని కంట పడింది. "అమ్మా! చీకటి కొన్నాళ్ళు, వెన్నెల కొన్నాళ్ళు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. నువ్వేం బెంగపెట్టుకోవద్దు" అంటూ ఓదార్చి, మహర్షి ఆమెను తన ఆశ్రమానికి తీసుకెళ్తాడు. నవమాసాలు నిండిన తర్వాత ఆమె ప్రసవిస్తుంది. మగబిడ్డ. ఆ బిడ్డ సర్వశుభలక్షణ సమన్వితుడు. చూడటానికి రెండు కళ్ళూ చాలవు. శుక్లపక్ష సుధాకరుడి చందంగా ఆ రాచబిడ్డ ఆశ్రమంలో పెరుగుతున్నాడు. సరే, ఆ కథ అలా ఉందా! ఇక్కడ రాచనగరులో వయసు మళ్ళిన రాజుగారి గతేమైంది?"

"ఏమైంది? ఏమైంది, నానమ్మా?' - నా కుతూహలానికి పట్టపగ్గాలు ఉండవు.

"చేసిన పాపం కట్టి కుడుపగా రాజుగారికి కళ్ళు పోతాయి. ఎందరెందరో వైద్యులు వచ్చి పెదవి విరిచి వెళ్ళిపోతారు. చివరికొక మహా వైద్యుడు మాత్రం చూపు తిరిగి రావడానికున్న ఒకే ఒక్క తరుణోపాయాన్ని సెలవిస్తాడు. అదేమిటంటే - కానని భూమిలో కస్తూరి కోనలో మంధరగిరిపైన ఓ మర్రి చెట్టు ఉంది. ఆ చెట్టు తొర్రలో మాట్లాడే మాణిక్యం ఉంది. కాపలా కాస్తున్న భేతాళుడితో పోరాడి జయించి, ఆ మాణిక్యాన్ని తెచ్చి రాజుగారి కళ్లకు తాకిస్తే, పోయిన చూపు తిరిగి వస్తుంది. కాని అంత పని చేయగలిగిన వాడుండాలి కదా! అదే సమస్య."

ఎవరైనా వెళ్లాలి. వెళ్లకపోతే ఎలా? వెళ్ళకపోతే కథ అక్కడికే ఆగిపోదా? అని నాకొక ధర్మసందేహం ఎదురయ్యేది. అయితే అందుకు సమాధానం నానమ్మ దగ్గర సిద్ధంగా లేకపోతే కదా!

"అప్పటికి ఆశ్రమంలోని రాకుమారుడు పెరిగి పెద్దవా డయ్యాడు. నూనూగు మీసాలొచ్చేశాయి. శ్రద్ధగా విద్యలన్నీ నేర్చుకున్నాడు. గురువుల అనుమతిని పొంది, తల్లి దీవనలు స్వీకరించి, ఆ పదహారేళ్ళ బాలా కుమారుడు మాట్లాడే మాణిక్యం తెచ్చే పనిపైన బయలుదేరాడు."

కథ మంచి రసపట్టులోకి వచ్చేసిందన్నమాట! నేను చెవులు రిక్కించుకుని వింటూంటాను. నానమ్మ కొనసాగిస్తుంది.

"రాజకుమారు డలా బయలుదేరాడా! చీమలు దూరని చిట్టడవులు వచ్చాయి. కాకులు దూరని కారడవు లెదురయ్యాయి. రాకుమారు డెట్లానో ముందుకు, మున్ముందుకే దారి తీస్తున్నాడు. సాయంకాలమయింది. పొద్దు గూట్లో పడింది. కాసేపట్లో చీకట్లు ముసురుకోబోతున్నాయి. క్రూర మృగాలు సంచరించే దుర్గమారణ్యం. కానని భూమి అనగా ఏది? కస్తూరి కోనకు ఎలా వెళ్లాలి? ఎవరు చెబుతారు? అదంతా అలా ఉండగా ఈ రాత్రికి తానెక్కడ విశ్రమించాలి? ఇలా ఎన్నో సందేహాలతో, ఆలోచనలతో కొట్టుమిట్టాడిపోతున్నాడు రాకుమారుడు. అప్పుడేమైందో తెలుసునట్రా, నాయనా!"

"ఏమైంది, నానమ్మా!"

"బాబూ, నాయనా! ఇలా రా, తండ్రీ! ఇదిగో ఇక్కడ! - అంటూ పిలుపు వినిపించింది. పిలుపు వినవచ్చిన దిశగా తల ఎత్తి చూశాడు రాకుమారుడు.

"ఒక చిన్న మట్టి గుట్ట. దానిపైన ఓ పర్ణకుటీరం. అడవిని, ఇంటి ఆవరణను వేరు చేస్తూ ఒక పొట్టి కంచె. కంచె కొక మూలగా ఒక గంగరావి చెట్టు, చెట్టు కింద నిలబడి ఓ ఆకారం

తనను పిలుస్తోంది.

"ముగ్గు బుట్టలా నెరసిన తల. వీపుకాస్తా వెనక్కు పోగా, తల కొంచెం ముందుకొచ్చినట్టు వంగిన శరీరం, చూడటానికి గాజుకుప్పెల్లా ఉన్నా, ఎంతదూరమైనా చూడటానికి అలవాటు పడినట్టున్న కళ్లు, మచ్చుకు కొన్ని పళ్ళు మాత్రమే మిగిలి ఉన్న బోసి నోరు. ముక్కున ముక్కెర, చేత దుడ్డుకర్ర. మహారణ్యంలో, మనుష్య సంచారం లేనిచోట ఒంటరిగా, నిబ్బరంగా ఎవరబ్బా ఈమె?

"తెలియదా, నాయనా! ఎప్పుడూ వినలేదా? పేదరాశి పెద్దమ్మను నేనే!"

రాకుమారుడికి తెలియకపోతే పోవచ్చు, కానీ నానమ్మ ఇలాంటి కథలు చాలా చెప్పినందువల్ల నాకు మాత్రం పేదరాశి పెద్దమ్మ చిరపరచితురాలే! రాకుమారుల సాహస గాథల్లో ఆమె పాత్ర ఏమిటో నాకు క్షుణ్ణంగా తెలుసు. ఆపద్బాంధవిలా ప్రత్యక్షమైందా? ఆప్యాయంగా ఆహ్వానించిందా? ఆపైన ఆకలి తీరేటట్టుగా ఆగంతకుడి కామె కమ్మని భోజనం పెడుతుంది. మెత్తగా శయ్య సమకూరుస్తుంది. అతడు పడుకున్నాక ఎదురుగా కూర్చుని, వచ్చిన పనేమిటో అడిగి తెలుసుకుంటుంది. 'నాయనా! నువ్వు తూర్పుగా వెళ్ళు, పడమరగా వెళ్ళు, దక్షిణంగా వెళ్ళు, కానీ ఉత్తరంగా మాత్రం వెళ్ళొద్దు' అని హెచ్చరిస్తుంది. కానీ రాకుమారుడు సింగపు కొదమలాంటి వీరకిశోరం కదా! ఏమవుతుందో కానిమ్మని ఉత్తర దిక్కుకే వెళ్తాడు. వెళ్లగా వెళ్లగా ఊడలు దిగిన మర్రిచెట్ల నడుమ అమ్మవారి ఆలయం. ఆలయంలో దేవిని ఉపాసిస్తూ ఒక కాపాలికుడు. వా డిది వరకే తొంభై తొమ్మిది రాజకుమారులను దేవికి బలి ఇచ్చేశాడు. ఇంకొక్క తల మాత్రమే బాకీ. వెళ్ళిన రాచబిడ్డను చూడగానే ఆ మాంత్రికుడికి తన రొట్టె విరిగి తేనెలో పడినట్లయింది.

స్నానం చేసి శుచిగా వస్తే దేవీ దర్శనం చేయిస్తా నంటాడు. కోనేటిలో దిగి స్నానం చేస్తుంటే ఓ మొసలి రాకుమారుడి కాలిని పట్టేస్తుంది. దాన్ని సంహరిస్తాడు. మొసలికి మోక్షం, శాపవిమోచనం, గంధర్వ కన్యగా ప్రత్యక్షం. సన్యాసి దుస్తంత్ర మేమిటో తెలియజేయడం. అవకాశం చూసుకుని రాకుమారుడే దొంగ సన్యాసిని అమ్మవారికి బలి ఇవ్వడం, దేవీ దర్శనం, వరాలన్నీ సిద్ధించడం, కోరికలన్నీ నెరవేరడం, సుఖో జయంగా కథ సమాప్తం కావడం, అంతటితో కథ కంచికి వెళ్లడం, మనం (ఊహా లోకాలన్నీ తిరిగి) ఇంటికి రావడం - ఇంతే సంగతులు!

అయితే కాలక్రమాన నాకు రాజుల పట్ల, యువరాజుల పట్ల ఆసక్తి సన్నగిల్లుతూ వచ్చింది. మధ్యలో కాస్తో, కూస్తో వెతలపాలైనప్పటికీ ఆఖరు కెట్లాగైనా రాజభోగాలు వాళ్లని వరిస్తాయి. పన్నీటి స్నానాలు, పట్టు పాన్పులు, చీని చీనాంబరాలు, ఏడువారాల సొమ్ములు, మృష్టాన్న భోజనాలు, అడుగులకు మడుగులొత్తే దాసదాసీ జనులు - వాళ్ల కేం కొరత? పేదరాశి పెద్దమ్మను వాళ్ళతో పోల్చుకుంటే పొగ మబ్బులు కమ్ముకున్న గగనంలా మనసంతా దిగులుతో నిండిపోయేది. ఆవురావురని నోరు తెరుచుకున్నట్టుండే ఆకాశం. అడవి చీర కట్టుకుని నిశ్శబ్దంగా పడి ఉండే పుడమి తల్లి. సూర్యుని కిరణాల కడ్డంగా అరచేయి పట్టుకుని, ఎవరైనా వస్తారేమో నన్న ఆశతో, ఎంతకూ రాని వారి కోసం ఎదురుతెన్నులు చూసే ఆ ముడుకాళ్ళ ముసలావిడ నా జ్ఞాపకాల వాకిట్లోనుంచి తొలగిపొయ్యేది కాదు. బలంగా ఓ గాలి వీస్తే అమాంతంగా ఎగిరి వెళ్ళి ఏ లోయలోనో పడిపోయే వాలకంతో ఉన్న ఆ గుడిసె - బండలు పగిలే ఎండల్లోనుంచీ, కుండపోతగా కురిసే వానల్లోనుంచి, గజగజలాడించే చలిగాలుల నుంచి ఆమె కేపాటి రక్షణ ఇవ్వగలుగుతుంది? పోనీ ఎలాంటిదో ఒక ఆశ్రమం ఉండిపోయిందిపో, ఆ మాత్రం చాలునా? ఉప్పు, పప్పూ, నూనె నూకలు, పాలు, పెరుగు, ఆకులు, పోకలు మొదలైన జీవితావసర వస్తువులు ఉండనక్కరలేదా? అవన్నీ చేకూరే తెరవేది? ఎంతగా పేదరాశి పెద్దమ్మ

అయితే మాత్రం ఆమె కూడా ఒకప్పుడు పసిపాపై ఉండదా? అప్పుడామెకు తల్లిదండ్రు లుండి ఉండరా? ఒక మగమహారాజుతో పెళ్ళయి ఉండదా? కొడుకులూ, కూతుళ్లూ పుట్టి ఉండరా? పల్లెలుగా, పేటలుగా, బస్తీలుగా, పట్నాలుగా వ్యాపించిన మానవ నాగరికతా ప్రపంచంలో ఆమెకింత చోటు, ఇంత తిండీ ఎందుకు దొరకనట్టు? ఎందుకిలా కీకారణ్యంలోకి కొట్టుకొచ్చినట్లు?

వచ్చిందిపో, ఎందుకిక్కడే స్థిరపడిపోయినట్టు? రాజుగారి కేమో పోయిన కళ్లు తిరిగొస్తాయి. మహారాణి ఇడుముల నుంచి బయటపడి రాజధానికి తిరిగి వెళ్తుంది. రాకుమారుడు ప్రవాస జీవిత మనే గ్రహణం నుంచి విముక్తి పొంది, రాకా సుధాకరుడిలా ప్రకాశిస్తాడు. వాళ్ల విషయంలో కథ కదులుతుంది. మరి పెద్దమ్మ విషయంలో మాత్రం కథ ఎందుకు కదలడం లేదు? రుచిగా వండిపెడితే సుష్టుగా తిని, తమ స్వంత గొడవంతా ఏకరువు పెట్టి, ఆమె వల్ల పొందగలిగినంత సాయం పొందగలిగేవాళ్ళే కానీ, ఆమెను గురించి తెలుసుకోవాలన్న ఆసక్తిని వ్యక్తపరిచే వాళ్లే లేరే!

ఇలా పేదరాశి పెద్దమ్మ గురించిన జిజ్ఞాస నా అంతరాంతరాల్లో నిండి నిబిడీకృతమై పోయిన రోజుల్లో, ఒకనాటి రాత్రి నే నొక కలగన్నాను. ఆ కలలో నేను పెద్దమ్మను కలుసుకోవడమే ఏకైక లక్ష్యంగా కీకారణ్యమంతా కలయ తిరుగుతున్నాను. వెతకగా వెతకగా చిట్టచివరకు ఆడబోయిన తీర్థం ఎదురైనట్టుగా ఒక దశలో నేను పెద్దమ్మ గుడిసె ఎదుట నిలబడిపోయి ఉన్నాను.

"బాబూ, నాయనా, ఇలా, రా తండ్రీ! ఇదిగో, ఇక్కడ!" అంటూ చిరపరిచితమైన రీతిలో పిలుపు వినిపించింది. పిలుపు వినవచ్చిన దిశకు తేరిపారజూస్తే పచ్చటి కాగితంపైన గీచిన తెలుపు రంగు రేఖాచిత్రంలా పెద్దమ్మ ఆకారం పొడగట్టింది. ఆహ్వానం, ఆతిథ్యం, పరామర్శ అంతా మామూలే! లేదంటే అక్కడినుంచి కథ కొత్త పుంత తొక్కింది.

"చూడు పెద్దమ్మా! ను వెవ్వరివి? ఎక్కడి దానివి? ఎవరిదానివి? నీ వాళ్లందరూ ఏమయ్యారు? ఒంటరిగా ఈ అడవిలో ఎందుకు కాలం వెళ్లదీస్తున్నావు?" అని బట్టీపట్టినట్టుగా అడగవలసిన ప్రశ్నలన్నీ అడిగేశాను.

"నాయనా, రాజశేఖరం! చెబుతాను విను!" అంటూ ప్రారంభించింది పెద్దమ్మ.

"నదులు పుట్టిన చోటు ఎవరికీ తెలియదంటారు. నా పుట్టుక గురించి నాకు తెలిసిందీ అంతే! నే నెప్పుడు, ఎక్కడ పుట్టానో తెలియదు. అసలు నాకు తల్లిదండ్రు లెవరో తెలియదు; పుట్టినప్పటి నుంచి ఇక్కడే, ఇలాగే ఉన్నాను. పెరిగిందీ లేదు, తరిగిందీ లేదు. బాల్యం, యౌవనం, కౌమారం, ముసలితనం, మృత్యువులాంటి వేవీ నాకు లేవు. నేను గతానికి గానీ, భవిష్యత్తుకు గానీ చెందినదాన్ని కాను! వర్తమానంలోనే నా జీవనం. అనంతమైన కాలం నా స్నేహితురాలు. నాకు ఆకలి కాదు. దాహం వేయదు. రోగం రాదు. నా చీర మాయదు, జుత్తు రేగదు. ఎండలు, వానలు, చలి, ఝుంఝామారుతం - ఏవీ నాపైన ప్రభావాం చూపెట్టవు.

"నాకు దిగులు లేదు, భయం లేదు, వాంఛ లేదు. చెట్లెందుకు గాలి వీస్తాయి? తీగ లెందుకు పూలు పూస్తాయి? నదు లెందుకు ప్రవహిస్తాయి? అందుకే, అలాగే నే నిక్కడున్నాను. ఉంటాను. అడవిలోని పచ్చదనాన్ని నేను. సెలయేటిలోని చైతన్యాన్ని నేను. కోయిల కూతలోని మాధుర్యాన్ని నేను. న న్నింకా మనిషినే ననుకుంటున్నావా, బాబూ! కాదు, కాదు. నేను కథలోని పాత్రను. ఆసక్తికరంగా కథలు చెప్పే నానమ్మ లున్నంతవరకు, ఆనందంగా కథలు వినే పసిపిల్ల లున్నంతవరకు నే నుంటాను. అంతెందుకు? ఎందాకా కుల గిరులు, ఎందాకా నదులు ఉంటాయో, ఎందాకా నరజాతి అవనిపైన వరలుతుందో అందాకా నే నుంటాను! పువ్వులో పరిమళంలాగా, వేణువులో

నాదంలాగా, మలయ మారుతంలోని మధుర స్పర్శలాగా నేను చిరంజీవిని! తెలిసిందా, నాయనా! నీ సందేహాలన్నీ తీరినట్టేనా?"

హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో కుదిపి లేపినట్లుగా కళ్ళు తెరిచాను. పున్నమి వెళ్ళిన నాలుగో రోజేమో, పడమటి దిక్కు నుంచి చంద్ర కిరణాలు వచ్చి నా మంచంపైన పడుతున్నాయి. కిటికీలోనుంచి పైకి చూశాను. చంద్రబింబం కనిపించింది.

"నాయనా, రాజా! చందమామలో ఓ ముసలమ్మ పెనముపైన గారెలు కాలుస్తూ ఉంటుంది. జాగ్రత్తగా చూశావంటే కనిపిస్తుంది!" అని చెబుతుండేది మా నానమ్మ.

చాలాకాలం తర్వాత పరిశీలనగా చూశాను. నిజమే! యుగయుగాల ముసలమ్మ ధగధగా మెరిసిపోతున్న చంద్రమండలంలో నుంచి విశ్వాంతరాళంలోని మిగిలిన లోకాలన్నింటినీ పలకరిస్తున్నట్టే ఉంది. ఆశ్చర్య మేమిటంటే ఆమె ముమ్మూర్తులా ఇంతకు మునుపు నాకు కలలో కనిపించిన పెద్దమ్మ లాగే ఉంది.

ఇంకొకసారి పేదరాశి పెద్దమ్మ ఎప్పుడైనా కలలో కనిపిస్తే అడగాలి -

"పెద్దమ్మా! పెద్దమ్మా! చందమామలో గారెలు చేసే ముసలమ్మ నీ కేం కావాలి?" అని.

*(ఆంధ్రప్రభ వారపత్రిక 1995)*